సాక్షి విశాఖపట్నం

7

బుధవారం ၊ 5 ၊ ఫిబ్రవరి ၊ 2025

క్యాన్సర్‌ను జయిద్దాం




బీచ్‌రోడ్డు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా మంగళవారం నగరంలోని పలు నర్సింగ్ కళాశాలల విద్యార్థులు సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఉన్న రక్షణ గోడపై నిల్చొని క్యాన్సర్‌పై సందర్శకులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రత్యక్ష దైవమా.. ప్రణామం

సాగర తీరంలో సూర్య నమస్కారాలు





రథసప్తమి సందర్భంగా సాగర తీరంలో మంగళవారం ఉదయం పలు యోగా సంస్థల ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాలు చేశారు. చిన్నపిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని 108 సూర్య నమస్కారాలు, ఆదిత్య హృదయం పారాయణం పఠించడంతో పాటు యోగాసనాలు వేశారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగాను ఆచరించడం ద్వారా మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు. – బీచ్ రోడ్డు





సాగర తీరంలో సూర్యనమస్కారాలు చేస్తున్న యువత

సూర్యదేవా నమోస్తుతే..!

- సింహగిరిపై ఘనంగా రథసప్తమి
- సూర్యభగవానుడిగా దర్శనమిచ్చిన అప్పన్న
- పరవశించిన భక్తజనం



సూర్యప్రభ వాహనంపై తిరువీధిలో సూర్యభగవానుడిగా అప్పన్న

సింహాచలం : సింహగిరిపై మంగళవారం రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రాతిరథంపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సూర్యభగవానుడిగా భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, ఆళ్వారులను మేళతాళాల మధ్య తీసుకొచ్చి ఆలయ ప్రాంగణంలోని హంసమూలన ఉన్న రాతిరథంపై ఉదయం 8గంటలకు వేంజేపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, గంగధార జలాభిషేకం నిర్వహించారు. అనంతరం అరుణ పారాయణ పఠనాన్ని నిర్వహించారు. విశేషంగా హారతులిచ్చారు. అలాగే సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను సూర్యప్రభవాహనంపై వేంజేపజేసి సింహగిరి మాడ వీధిలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చక్రపాణి, వేద పండితులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.



రాతిరథంపై ఉన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వైఎస్ జగన్‌ను కలిసిన ధర్మశ్రీ, అమర్‌నాథ్



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న కరణం ధర్మశ్రీ, అమర్‌నాథ్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ చోడవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంటు స్థానం పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేసి.. కార్యకర్తలను కలుపుకొని పోవాలని ధర్మశ్రీతో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో పార్టీ పరిస్థితి గురించి వాకబు చేస్తూ.. బాధ్యతలు అప్పగించిన వెంటనే పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తల్లో జోష్ పెంచావని అభినందించారు. చోడవరం నియోజకవర్గంలో గుడివాడ అమర్‌నాథ్‌కు అండగా ఉండాలని ధర్మశ్రీకి సూచించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ తమ అధినేత జగన్ చాలా ఉత్సాహంగా ఉన్నారని, కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్తేజంతో పనిచేయాలని కోరారు.

యూఎల్‌సీ భూములపై కూటమి గెద్దలు





- భారీ ఆదాయమే లక్ష్యంగా యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ
- ఇప్పటికే పలు స్థలాలను తమ గుప్పెట్లో పెట్టుకున్న కూటమి నేతలు
- క్రమబద్ధీకరణ చేయిస్తామంటూ నగం రేట్లకే కొట్టేసిన 'చిన' గ్యాంగ్
- ఇవ్వకుంటే కొర్రీలు పెట్టి క్రమబద్ధీకరణ కాకుండా చేస్తామని బెదిరింపు

మిగులు భూములపై **కూటమి గెద్దలు వాలి**పోయాయి. పట్టణ **భూ గరిష్ట పరిమితి** (యూఎల్‌సీ) స్థలాల**ను కారు చౌక**గా కొట్టేయడానికి రంగం**లోకి దిగిపోయాయి.** విశాఖలో ఈ స్థలాల **జాబితాను ఇప్పటికే** సంపాదించి వాటి **యజమానులతో బేరసా**రాలు చేసే పనిలో **నిమగ్నమైపోయాయి.** ఇదే పనిమీద ఒక **'చిన' గ్యాంగ్ విశాఖలో** గత రెండు నెలలుగా **తిష్టవేసినట్లు** సమాచారం. మిగులు **భూముల క్రమబద్ధీక**రణకు ప్రభుత్వం గత **నెల 27వ తేదీన గ్రీన్** సిగ్నల్ ఇచ్చింది. ఈ **భూములను రెగ్యుల**రైజ్ చేస్తున్నట్లు గత కొద్ది నెలలుగా ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరిగింది. దీంతో చిన్న చిన్న ఆక్రమణ స్థలాల్లో ఉన్న నిర్మాణాలు క్రమబద్ధీకరణకు నోచుకుంటాయని అందరూ భావించారు. ఇదిలా ఉంటే మధురవాడ, కొమ్మాది, ఇతర శివారు ప్రాంతాల్లో అధిక విస్తీర్ణాల్లో మిగులు భూములు ఉన్నాయి. వీటిని కాజేయడానికి కొంత మంది తెరవెనుక ప్రయత్నాల్లో ఉన్నారు. – మహారాణిపేట

150 గజాలలోపు స్థలాలకు ఉచితం

యూఎల్‌సీ **భూములు ఉన్న** వ్యక్తులు తక్షణం సం బంధిత ఏరియా **తహసీల్దార్** కార్యాలయం**లో దరఖాస్తు చేసుకోవాలి.** ఆక్రమణలో ఉన్న **150 చదరపు గజాలకు ఉచి**తంగా క్రమబద్ధీక**రణ చేయనున్నారు. 151** గజాల నుంచి 300 **చదరపు గజాల లోపు వర**కు రిజిస్ట్రేషన్ బేసిక్ **వేల్యూపై 15 శాతం, 500 గ**జాల వరకు ప్రస్తుత **రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూపై** 30 శాతం వరకు **చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత**ం రిజిస్ట్రేషన్ బేసిక్ **వేల్యూపైన 100 శాతం విలు**వను లెక్కించి అం**దులో మొదటి విడతగా** 50 శాతం నగదు **డిమాండ్ డ్రాఫ్ట్ లేదా చెక్కు** సిద్ధం చేయాలి. **పూర్తి చేసిన దరఖాస్తుతోపా**టు డీడీని జతపరిచి **సంబంధిత తహసీల్దార్** కార్యాలయంలో **సమ**ర్పించాల్సి ఉంది.

క్రమబద్ధీకరణకు గ్రీన్‌స్నిగల్

ఈ క్రమంలో గత నెల 27న ప్రభుత్వం యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు గ్రీన్‌స్నిగల్ ఇచ్చింది. గతంలో ఉన్న అనేక జీవోలను సవరిస్తూ తాజాగా కొత్త జీవోను జారీ చేసింది. యూఎల్‌సీ యాక్ట్ 1976 ప్రకారం పట్టణ పరిధిలో భూములను క్రమబద్ధీకరణ చేసి తద్వారా ఆదాయం పెంపొందించుకోవడానికి సన్నద్ధమైంది. దీంతో పట్టణ సమీకరణ చట్టం పరిధిలో ఉన్న మిగులు భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

విశాఖలో 'చిన' గ్యాంగ్ తిష్ట

విశాఖలో గత కొద్ది కాలంగా తిష్టవేసిన 'చిన' గ్యాంగ్ మధురవాడ, ఆనందపురం, భీమిలి, పెందుర్తి, గాజువాక, అగనంపూడి తదితర ప్రాంతాల్లో భూముల పరిస్థితులపై ఆరా తీసింది. విశాఖలో విలువైన, వివాదంలో ఉన్న స్థలాలతో పాటు అసైన్డ్, యూఎల్‌సీ, భూదాన భూములు, చుక్కలు, ఇనాం, గ్రామ కంఠం భూముల వివరాలను సేకరించింది. ప్రధానంగా అసైన్డ్, యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందని ముందుగానే తెలియడంతో వాటిపైనే దృష్టి సారించింది. ఈ భూముల వివరాలు సేకరించి వాటి యజమానుల నుంచి అనధికారికంగా హక్కుల పొందే పనిలో ఉన్నట్లు సమాచారం. కొంత మందికి అడ్వాన్సులు ఇచ్చి ఇప్పటికే అసైన్డ్ భూములను అనధికారికంగా తమ పేర్ల మీద అతి తక్కువ ధరకు రాయించుకున్నట్లు తెలుస్తోంది.

భూ యజమానులతో బేరసారాలు



విశాఖ నగరంలో అల్లిపురం, మద్రిపాలెం, కంచరపాలెం, సీతమ్మధార, హెచ్‌బీ కాలనీ, గాజువాక, గోపాలపట్నం, సీతంపేట తదితర ప్రాంతాల్లో పట్టణ గరిష్ట పరిమితి చట్టం కింద భూములు ఉన్నాయి. ఈ భూములను 22ఏ కింద పెట్టి రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారు. ఈ భూములను ఎన్నో సంవత్సరాల నుంచి క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టింది. ఈ భూముల ద్వారా ఆదాయ మార్గాలు ఉన్నాయా? అన్న దానిపై కసరత్తు చేసింది. యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణ ద్వారా కొంత మేర ఆదాయం సమకూరుతుందని రెవెన్యూ వర్గాల నుంచి సానుకూల స్పందన రావడంతో ఆ దిశగా మొగ్గు చూపింది. అయితే ఇప్పటికే ఈ భూముల వివరాలను సేకరించిన 'చిన' గ్యాంగ్ క్రమబద్ధీకరణ చేయిస్తామని.. భూయజమానుల నుంచి తక్కువ ధరకు స్థలాలను కొట్టేయాలని ప్రయత్నిస్తోంది. కొంత మంది యజమానులతో బేరసారాలు కూడా సాగించింది. అంగీకరించని పక్షంలో క్రమబద్ధీకరణ కాకుండా చేస్తామని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది.

పడిలేచారు.. స్ఫూర్తినిచ్చారు



క్యాన్సర్‌ను జయించిన విజేతలు

ఆరిలోవ: క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ జాతీయ స్థాయిలో ప్రచారం చేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వాణి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని మంగళవారం హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రి క్యాన్సర్ విభాగంలో నిర్వహించారు. అపోలో క్యాన్సర్ సెంటర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), రాష్ట్ర అంకాలజీ సంఘాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స పొంది విజేతలుగా నిలిచినవారికి మెడల్స్ అందించి గౌరవించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ అపోలోలో క్యాన్సర్‌పై 'యునైటెడ్ బై యూనిక్' అనే నినాదంతో జాతీయ క్యాంపెయిన్ చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మురళీమోహన్, అపోలో వైద్యుడు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మాసిటీలో ప్రమాదం

కాంట్రాక్టు కార్మికుడికి స్వల్ప గాయాలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో కామన్ ఎంప్లాయిస్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు కరణం ముత్యాలనాయుడు(45) గాయపడ్డాడు. పైపులైన్ రిపేర్లు చేస్తున్న సమయంలో విడుదలైన రసాయనం ముత్యాలనాయుడి ముఖంపై పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ముత్యాలునాయుడు సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం గ్రామానికి చెందినవాడు. సమాచారం అందుకున్న యాజమాన్యం క్షతగాత్రుడిని వైద్యం కోసం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు కోలుకుంటున్నాడని పరవాడ పోలీసులు చెప్పారు. యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగానే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. ప్రమాదంలో గాయపడిన ముత్యాలనాయుడికి మెరుగైన వైద్యం అందించి, కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మ వారిని మంగళ వారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఖర్జూరం, జీడి పప్పు, వివిధ రంగుల బంతి, చామంతుల దండలతో అలంకరించారు. – తగరపువలస

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే రాణింపు

- క్రికెటర్ షబ్నమ్ వెల్లడి
- ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం



విమానాశ్రయంలో క్రికెటర్ షబ్నమ్‌కు స్వాగతం పలుకుతున్న జియ్యాని విజయ్, అభిమానులు

గోపాలపట్నం: ఇటీవల కౌలాలంపూర్‌లో జరిగిన అండర్–19 మహిళల టీ–20 ప్రపంచ కప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచిన నగరానికి చెందిన షబ్నమ్ షకీల్ మంగళవారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు 52వ వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్, క్రికెట్ అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఇటీవల విశాఖకు చెందిన క్రికెటర్లు మంచి ప్రతిభ చూపిస్తున్నారని అన్నారు. మహిళా క్రికెట్‌లో షబ్నమ్ షకీల్, పురుషుల క్రికెట్‌లో నితీష్ కుమార్‌రెడ్డి మంచి ప్రతిభ కనబరిచి అందరి దృష్టిని ఆకర్షించారన్నారు. షబ్నమ్ ఈ ప్రపంచ కప్ సాధనలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. అనంతరం షబ్నమ్ తల్లిదండ్రుల్ని ఘనంగా సత్కరించారు.

ప్రపంచకప్‌లో అవకాశం దక్కడం అదృష్టం

ప్రపంచ కప్ టోర్నీలో రాణించడంలో తల్లిదండ్రుల ఆశీర్వాదం, వారి ప్రోత్సాహమే ప్రధాన కారణమని షబ్నమ్ అన్నారు. తన తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తనకు శిక్షణ ఇప్పించి, ఈ స్థాయికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రపంచ కప్ టోర్నీలో అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ కప్ టోర్నీలో ఎటువంటి ఒత్తిడికి గురవకుండా ఆటను ఎంజాయ్ చేసినట్లు చెప్పారు. అందుకే రాణించి కప్ గెలిచామన్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి 3 నామినేషన్లు



నామినేషన్ అనంతరం ప్రమాణం చేస్తున్న శ్రీరంగ పద్మావతి

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆర్వో సమక్షంలో ప్రమాణం చేశారు. ఏపీటీఎఫ్ మద్దతుదారుగా బరిలోకి దిగిన పాకలపాటి రఘువర్మ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేయగా, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు. రఘువర్మ వెంట ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మద్దతుదారులు తరలివచ్చారు.

ఒడిశాలో ఘనంగా శ్రీనృసింహ హోమం



పూజలు చేస్తున్న ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు

సింహాచలం: ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా పద్మనాభపురంలో మంగళవారం శ్రీనృసింహ హోమం ఘనంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా పద్మనాభపురంలో ఉదయం శ్రీనృసింహ హోమం పెద్ద ఎత్తున నిర్వహించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను, చక్రపెరుమాళ్లని కొలువుంచారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను విశేషంగా జరిపారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు ఈ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.


శిల్పారామంలో కింగ్ చేస్తున్న పాటల పందిరి సభ్యులు


పాటలు పాడుతున్న సీనియర్ సిటిజన్స్

అటు వాకింగ్ ఇటు సింగింగ్

- పాటల పందిరితో ఆనందాల సందడి
- వృద్ధాప్యంలో ఉల్లాసంగా..ఉత్సాహంగా
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సీనియర్ సిటిజన్స్

వయసు పెరిగేకొద్దీ మనసు చిన్నదైపోతోంది. పాజిటివ్ థింకింగ్ నిత్య యవ్వనంగా మార్చేస్తోంది. 60 పదులు దాటిన వారంతా స్వీట్-16గా మారిపోతూ ఉత్సాహంగా గడుపుతున్నారు. వయసుకే వృద్ధాప్యం కానీ..మా మనసుకు కాదని చాటి చెబుతున్నారు. సంతోషంగా ఉండడమే మా ఆరోగ్య రహస్యమంటున్నారు. తెల్లవారు జామున లేవడం..వాకింగ్ చేయడం..కాసేపు పాటలు పాడడం వీరి దినచర్య. 'పాటల పందిరి' సంస్థను స్థాపించి ఆరోగ్య ప్రపంచంలో విహరిస్తున్నారు.. పీఎంపాలెం, మధురవాడలోని సీనియర్ సిటిజన్స్.

-పీఎంపాలెం

ఆనందోత్సాహాలు ఎక్కడో లేవని సృష్టించుకుంటే కళ్లముందే ఉంటాయన్న నానుడిని పీఎంపాలెం మధురవాడ ప్రాంతంలో నివసిస్తున్న సీనియర్ సిటిజన్స్ నిజం చేస్తున్నారు. తమకు తాముగా పాటల పందిరి అనే సంస్థను స్థాపించుకున్నారు. పీఎంపాలెంలోని శిల్పారామంలో ఉదయం వాకింగ్ చేసిన అనంతరం తమకిష్టమైన పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతున్నారు. వృద్ధాప్యంలో చెప్పుకోలేని సమస్యలుంటాయి. కుటుంబ సమస్యలు వేధిస్తుంటాయి. అయితే వాటిని నుంచి బయటపడేందుకు ఈ ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్ పాటల పందిరిని ఏర్పాటు చేసుకున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు వాకింగ్ చేస్తున్నారు. రాళ్లను సైతం కరిగించే శక్తి సంగీతానికి ఉంటుందంటారు. అందుకే మనసు ప్రశాంతతకు వీరంతా సంగీతాన్ని ఎంచుకున్నారు. పాటల పందిరి నీడలో సరిగమల సరాగాల్లో వీరింతా మునిగి తేలుతున్నారు. పాత, కొత్త చిత్రాల పాటలు పాడుతూ ఒకరికొకరు అభినందించుకుంటున్నారు.

పాటల పందిరి ఓ ధైర్యం



చాలా మందికి పాడాలని ఉంటుంది. వివిధ కారణాలతో తమ అభిరుచిని బయటపెట్టేందుకు అవకాశం ఉండదు. 60 పదులు దాటిన వారంతా ఈ వయసులో పాటలేం పాడతాం..అనుకుంటారు. అలా అనుకున్నవాళ్లంతా పాటల పందిరిలో గొప్ప సింగర్లగా మారిపోయారు. మైక్ అందుకుంటే ఎన్నో పాత, కొత్త పాటలతో అలరిస్తున్నారు. గతంలో గళం విప్పనివారు సైతం ఇప్పుడు తెలుగు, హిందీ పాటలు అద్భుతంగా పాడుతున్నారు.

-సీహెచ్. సత్యానంద్, పాటల పందిరి సంస్థ అధ్యక్షుడు

ఇదో చక్కటి వేదిక



విశ్రాంత ఉద్యోగినైన నేను పాటలు పాడే వాడిని కాదు. పాడడానికి అవకాశమూ రాలేదు. పాటల పందిరి ఏర్పాటు చేసిన తరువాత పాడడం ట్రై చేశా..సాంకేతికత సాయంతో ప్రముఖ సంగీత దర్శకులు, సినీ గాయకులు ఆలపించిన పాటలు పాడుతున్నా..పాడుతుంటే ఏదో తెలియని ఆనందం..వృద్ధాప్యంలో ఇంతకంటే ఏం కావాలి..తెలుగు, హిందీ భాషలోని సినీ గీతాలు, భక్తి గీతాలు ఆలపిస్తున్నా.

-సీహెచ్. భాస్కరరావు, పాటల పందిరి సభ్యుడు

వీలైతే రెండు పాటలు..కుదిరితే నాలుగు స్టెప్పులు



చదువుకునే రోజులలో సరదాగా పాటలు పాడే వాడిని. మొదటి నుంచీ సినిమా పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. పాడటమే కాదు అవసరమైతే నాలుగు స్టెప్పులూ వేయగలను. పాటల పందిరిని మరింత విస్తరింపజేయడానికి కృషి చేస్తా.

-యండమూరి రాంప్రసాద్, పాటల పందిరి సభ్యుడు

ఆపాత మధురాలంటే చాలా ఇష్టం



అమరగాయకుడు ఘంటశాల వేంకటేశ్వరరావు అద్భుతంగా ఆలపించిన భగవద్గీత శ్లోకాలు తాత్పర్య సహితంగా ఆలపించడం అంటే ఎంతో ఇష్టం. పాటల పందిరిలో చాలా సార్లు ఆలపించా. యేసుదాస్, ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన సినీగీతాలు ఎన్నో పాడా..పాటల పందిరిలో రోజూ పాటలు పాడడం చాలా సంతోషాన్నిస్తోంది. – టి.మహేశ్వరారావు, పాటలపందిరి సభ్యుడు

హెచ్‌పీ గ్యాస్ కంపెనీ కార్మికుడి మృతి

- న్యాయం చేయాలని కార్మికులు, కుటుంబ సభ్యుల ఆందోళన
- రూ.14 లక్షలు చెల్లించేందుకు అంగీకరించిన యాజమాన్యం


మృతుడు రమణ (ఫైల్)

మల్కాపురం: డాక్‌యార్డులో సమీపంలోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు మృతి చెందాడు. విజయనగరం జిల్లా మంగళపాలెం వద్ద గల దేశపాత్రునిపాలెం ప్రాంతానికి చెందిన గౌరపల్లి రమణ (35) హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో లోడింగ్, అన్‌లోడింగ్ విభాగంలో 15 ఏళ్ల నుంచి పని చేస్తున్నాడు. ఇతనికి భార్య రమణమ్మ, దుర్గా,కల్యాణి అనే ఇద్దరు కుమార్తెలున్నారు. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. సంస్థలో గ్యాస్ సిలిండర్లను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో రాత్రి పదిగంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే షీలానగర్ వద్ద ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు ప్రయత్నించగా..కుటుంబ సభ్యులు, కార్మికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన నిర్వహించారు. రాత్రి 12 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి ఆందోళన కొనసాగించారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని యాజమాన్యంతో కార్మిక సంఘాలు చర్చలు జరిపాయి. దీంతో యాజమాన్యం దిగొచ్చింది. గ్యాస్ డీలర్ల సమక్షంలో మృతుని కుటుంబానికి 15 రోజుల్లో రూ.14 లక్షల పరిహారం చెల్లిస్తామని యాజమాన్యం అంగీకరించింది. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.


మృతుడు కుటుంబానికి న్యాయం చెయ్యాలని నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

రౌడీషీటర్‌తో సహా ముగ్గురు అరెస్టు

మహారాణిపేట: తనను ఉద్యోగంలోంచి తీసేశారన్న కోపంతో పగబట్టిన ఓ రౌడీషీటర్, అతనికి సహకరించిన మరో ఇద్దర్ని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జీడీ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్‌లోని ఏవీఎన్ కళాశాల డౌన్ ప్రాంతంలో ఉంటున్న రాజు అనే రౌడీషీటర్ గతంలో కేజీహెచ్‌లో పని చేశాడు. మద్యం సేవించి విధులకు హాజరవుతున్నాడన్న ఆరోపణలపై వైద్యాధికారులు అతడ్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు ఈ నెల ఒకటో తేదీన ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డుకు సరఫరా అయ్యే ఆక్సిజన్ పైపులను కట్ చేసే ప్రయత్నం చేశాడు. ఇది చూసిన సెక్యూరిటీ గార్డులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారిని రాజుతో పాటు మరో ఇద్దరు కత్తితో బెదిరించారు. అందరూ చూస్తుండడంతో అక్కడి నుంచి వీరంతా పరారయ్యారు. ఈ విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది వైద్యాధికారులకు తెలపగా..వారు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ జీడీ బాబు హుటాహుటిన కేజీహెచ్‌కు వెళ్లి వివరాలు సేకరించారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. రాజుపై గతంలో పలు కేసులున్నట్టు సీఐ జీడీ బాబు వెల్లడించారు.

అనారోగ్య సమస్యలతో పెయింటర్ ఆత్మహత్య


మృతుడు గణేష్

పీఎంపాలెం: స్థానిక స్టేషన్ పరిధిలో ఓ పెయింటర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలుగుబిల్లి గణేష్ (43)మిథిలాపురి వుడా కాలనీ మానసా రెసిడెన్సీ ప్లాట్ నంబరు 103లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తుండగా, భార్య శ్రావణి ఓ టైలరింగ్ షాపులో పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం కుమార్తెలు పాఠశాలకు వెళ్లగా భార్య శ్రావణి టైలరింగ్ షాపునకు వెళ్లింది. 11.30 గంటల సమయంలో శ్రావణి ఇంటికి వెళ్లి చూడగా గణేష్ హాలులోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనారోగ్య సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు భార్య శ్రావణి పోలీసులకు తెలిపింది. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

చోరీలకు పాల్పడిన ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న క్రైం ఏసీపీ వెంకటరావు

ఆరిలోవ: ఆరిలోవ పోలీసు స్టేషన్ సమీపంలో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ద్వారకా క్రైం ఏసీపీ ఎ.వెంకటరావు వివరాలు వెల్లడించారు. ఆరిలోవ టీఐసీ పాయింట్ సమీపంలో బొడ్డు శివకృష్ణ ఇంట్లో గత నెల 24వ తేదీ రాత్రి దొంగతనం జరిగింది. రూ.50 వేలు విలువ చేసే 5 సెల్‌ఫోన్లు, 2 చార్జర్లు, ఒక జత ఇయర్ బడ్స్‌ను అపహరించారు. దీంతో 25వ తేదీ ఉదయం శివకృష్ణ ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం ఎస్.ఐ ఎ.హరికృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారని చెప్పారు. క్రైం సీఐ చక్రధర్ ఎస్ఐతో కలిసి దొంగతనం జరిగిన పరిసరాల్లో సీసీ పుటేజీలు పరిశీలించగా అనుమానితులైన ఆరిలోవ టీఐసీ పాయింట్‌కు చెందిన పూడి వంశీ, నిశాంత్‌రెడ్డిని అదుపులో తీసుకుని విచారించారు. సెల్‌ఫోన్లతో పాటు ఆరిలోవ, ఆనందపురం, గోపాలపట్నం, పెందుర్తి పరిధిలో ద్విచక్రవాహనాలు కూడా దొంగిలించినట్లు వారు అంగీకరించారన్నారు. నిందితులతో వెళ్లి నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వీటితో పాటు దొంగలించిన ఐదు సెల్ ఫోన్‌లలో నాలుగు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఆయన అభినందించారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ పనుల పరిశీలన


ఆటోనగర్‌లో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్

అక్కిరెడ్డిపాలెం: ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా విశాఖపట్నం జోన్- 2 పరిధిలో ఆటోనగర్ ఈ - బ్లాక్ సబ్ డివిజన్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ పనులను మంగళవారం ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మిడి పృథ్వితేజ్ పరిశీలించారు. రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రత ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈపీడీసీఎల్ అధికారులు ఉన్నారు.

యువకుడి మృతికి కారణమైన ఐదుగురి అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: యువకుడిపై దాడి చేసి, అతని మృతికి కారణమైన ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గాజువాక శ్రీనగర్‌లోని శ్రీరామ్‌నగర్‌లో ఇంటి యజమాని మనుమరాలు(యువతి) స్నానం చేస్తుండగా ఫోన్లో వీడియో తీశాడనే అనుమానంతో ఫార్మా ఉద్యోగి జి.భాస్కరరావు (30)ను యువతి ప్రియాంక, తల్లి లక్ష్మితో పాటు యువతి స్నేహితులు హేమంత్, మణికంఠ, హేమశేఖర్‌లు దాడి చేసి ఇంట్లో నిర్బంధించారు. దీంతో మనస్తాపం చెందిన భాస్కరరావు ఇంట్లో కేబుల్ వైర్లతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడి మృతికి కారణమయ్యారంటూ దాడికి పాల్పడ్డ ఐదుగురిపై మృతుని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుల్ని మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ఐదుగురు విద్యార్థులను కాపాడిన లైఫ్ గార్డ్స్


ప్రాణాలతో బయటపడ్డ విద్యార్థులు

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఐదుగురు విద్యార్థులను బీచ్ లైఫ్‌గార్డ్స్ రక్షించారు. మధురవాడలోని ఓ ప్రైవేటు కళాశాల్లో ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న ఆరుగురు విద్యార్థులు మంగళవారం బీచ్‌కు వచ్చారు. కాసేపు సరదాగా గడిపి స్నానం చేసేందుకు వీరిలో ఐదుగురు విద్యార్థులు సముద్రంలోకి దిగారు. ఈ క్ర మంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ జి.రాజేష్, జి.దేవ, డి.ధనరా జ్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

ఒమేగాలో క్యాన్సర్ నిర్ధారణ సంచార కేంద్రం


ఒమేగా ఆస్పత్రి ఆవరణలో సంచార కేంద్రం

ఆరిలోవ: హెల్త్ సిటీలో ఒమేగా ఆస్పత్రిలో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిర్ధారణ సంచార కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చారు. సంచార కేంద్రం వాహనాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ సంచార కేంద్రం అందుబాటులోకి తీసుకువచ్చిన ఒమేగా ఆస్పత్రి నిర్వాహకులు, వైద్యులను అభినందించారు. సాధారణంగా మారుమూల ప్రాంతాలవారికి క్యాన్సర్ పై అవగాహన తక్కువగా ఉంటుందన్నారు. అలాంటి ప్రాతాల్లో సైతం ప్రజలకు ఈ సంచార కేంద్రం ద్వారా అవగాహన కల్పించవచ్చన్నారు. అనంతరం ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచంలో ప్రధానమైన వ్యాధులలో ఒకటిగా మారిందన్నారు. క్యాన్సర్ నిర్ధారణకు ఈ సంచార కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. మరో రెండు నెలల్లో 50 స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన రాజుబాబు(ఫైల్)

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ప్రమాదానికి గురైన వ్యక్తి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మరణించాడు. సీఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన ఇండుగబిల్లి రాజబాబు(43) వ్యక్తిగత పనిమీద స్కూటర్‌పై బయటకు వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి 11.30 సమయంలో ఇంటికి వస్తుండగా చిన ముషిడివాడ సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి అతడిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. రాజబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య ఆశ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్ యువతి మృతి


సేసోటి నాగ్ (ఫైల్)

బీచ్‌రోడ్డు: బంగ్లాదేశ్ యువతి రోడ్డు ప్రమాదంలో మరణించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బంగ్లాదేశ్‌కు చెందిన సేసోటి నాగ్(19) ఏయూలో బీఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఏయూ ప్లాటినం జూబ్లీ హాల్‌ నందు నిర్వహించిన సరస్వతి పూజకు హాజరై, తిరిగి స్నేహితుడి బైక్ మీద వెళ్తుండగా చినవాల్తేరు వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. ఆమె తల డివైడర్‌ను తాకటంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే రామ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

ఎంవీపీకాలనీ: మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. సింహాద్రిపురానికి చెందిన ఓ మైనర్‌పై పక్క ఇంట్లో ఉంటున్న గణేష్ సోమవారం లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన ఎంవీపీ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. దీంతో నిందితుడికి కోర్టు మంగళవారం 14 రోజులు రిమాండ్ విధించింది.



• జిహ్వాచేపల్యం

విశాఖ అంటేనే సాగరతీరం. ఇక్కడ ఎన్నో రకాల సముద్ర చేపలు మత్స్యకారుల వలకు చిక్కుతాయి. ఇందులో ఎండు చేపలు కూడా సింహభాగమే. ఇవి తింటే రుచితోపాటు ఆరోగ్యం కూడా. క్రమంగా ఎండలు పెరుగుతుండడంతో మంగళవారం ఇలా ఉప్ప చేపలను ఎండబెడుతూ మత్స్యకార మహిళలు దర్శనమిచ్చారు.

-ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

స్వల్పంగా పెరిగిన కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినా మంచు తీవ్రత అధికంగా ఉంది. మంగళవారం చింతపల్లిలో 10.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.పాడేరు డివిజన్ పరిధిలో జి.మాడుగులలో 11.9 డిగ్రీలు, జీకే వీధిలో 12.0 డిగ్రీలు,హుకుంపేటలో 12.1 డిగ్రీలు, అరుకు వేలిలో 12.4 డిగ్రీలు, పాడేరులో 12.6 డిగ్రీలు, డుంబ్రిగుడలో 13.1 డిగ్రీలు,పెదబరడలో 13.2 డిగ్రీలు, ముంచంగిపుట్టులో 15.3 డిగ్రీలు, అనంతగిరిలో 16.5 డిగ్రీలు, కొయ్యూరులో 16.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు.



• విహంగాల కిలకిలలు



కలెక్టరేట్‌లో ఆకర్షణీయమైన పక్షులు సందడి చేస్తున్నాయి. ప్రతి రోజు రామ చిలుకలు, వడ్రంగి పిట్టలు, ఇతర పక్షులు అలరిస్తున్నాయి. కలెక్టరేట్‌కు వచ్చే కొంతమంది ఆ పక్షులకు బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలను అందిస్తున్నారు. దీంతో రోజూ కార్యాలయ ప్రాంగణం పక్షుల కూతలతో సందడిగా మారుతోంది.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

